# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 15-06-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటన ముగించుకుని ఈరోజు ఉదయం న్యూ ఢిల్లీకి చేరుకున్నారు.
- పీఎం-కిసాన్ సమ్మాన్ పథకం నిధుల్ని ఈనెల 18వ తేదీన రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నామని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలియజేశారు.
- వచ్చే విద్యాసంవత్సరం నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు.
- ఖరీఫ్ సీజన్ లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించాలని మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు అధికారులను ఆదేశించారు.

==============================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటలీ పర్యటన ముగించుకుని ఈరోజు ఉదయం న్యూ ఢిల్లీకి చేరుకున్నారు. ఈ పర్యటన చాలా విజయవంతంగా జరిగిందని సామాజిక మాధ్యమం ద్వారా ప్రధానమంత్రి తెలియజేశారు. జీ-7 సదస్సులో పాల్గొన్న నరేంద్ర మోదీ, వివిద అంశాలపై భారతదేశ దృక్పథాన్ని ప్రపంచ దేశాలకు వివరించారు. భవిష్యత్ తరాలకు మెరుగైన ప్రపంచాన్ని రూపొందించడానికి భారత్ సిద్ధంగా ఉందని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా వివిధ దేశాల అధినేతలతో నరేంద్ర మోదీ విడివిడిగా సమావేశమయ్యారు. ఆయా దేశాలతో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసేందుకు చర్చలు జరిపారు. వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు మోదీకి పలువురు నేతలు శుభాకాంక్షలు తెలియజేశారు.

==============================

పీఎం-కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద 2 వేల రూపాయలను ఈనెల 18వ తేదీన నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నామని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఈరోజు ఆయన ఢిల్లీలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ... వారణాసిలో జూన్ 18న జరగబోయే కిసాన్ సమ్మేళన్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొని 17వ విడత పీఎం-కిసాన్ పథకం నిధులను విడుదల చేస్తారని వెల్లడించారు. నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం

వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు 3.04 లక్షల కోట్ల రూపాయలను అర్హులైన రైతులకు పెట్టుబడి సాయంగా అందించామని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ పాఠశాలల్లో వచ్చే విద్యాసంవత్సరం నాటికి పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లిలోని ఆయన నివాసంలో ఉన్నతాధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కొత్తగా చేపట్టాల్సిన పనులతో పాటు గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన ఫేజ్-2, ఫేజ్-3 పనులన్నీ ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు కిట్‌లు అందజేసే ప్రక్రియను ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఇంటర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జులై 15 నాటికి పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ ఇవ్వాలని ఆదేశించారు. ఇకపై ఉపాధ్యాయుల బదిలీలు పారదర్శకంగా జరుగుతాయని నారా లోకేష్ స్పష్టం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఖరీఫ్ సీజన్ సమీపించిన తరుణంలో రైతులకు విత్తనాలు, ఎరువులు కొరత రాకుండా చూడాలని వ్యవయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెంనాయుడు వ్యవయ శాఖ ఉన్నతాధికారుల్ని ఆదేశించారు. ఈరోజు ఆయన వెలగపూడి సచివాలయంలో వ్యవసాయం, పశుసంవర్ధక శాఖల ముఖ్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతులకు సబ్సిడీతో కూడిన యంత్రాలు, నాణ్యమైన పురుగు మందులను భవిష్యత్‌లో అందించాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సమీక్షలో వ్యవయ శాఖ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ ద్వివేది పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

బ్రిటిష్ కాలం లాంటి చట్టాలను సవరణ చేయడం వల్ల నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని తిరుపతికి చెందిన ప్రముఖ న్యాయవాది పోతులూరి మాసూమయ్య పేర్కొన్నారు. ఈరోజు తిరుపతిలో ఆకాశవాణితో ఆయన మాట్లాడుతూ.... కేంద్ర ప్రభుత్వం మూడు చట్టాలను సవరణ చేయడాన్ని స్వాగతించారు. బ్రిటిష్ కాలం నాటి చట్టాల కారణంగా ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ కక్షిదారులు తిరిగేవారని.. అలాంటిది కేంద్ర ప్రభుత్వం సవరణ చేసిన ఈ చట్టాలను జులై 1 నుంచి అందుబాటులోకి తీసుకురావడం వల్ల కక్షిదారులకు సత్వర న్యాయం జరిగే అవకాశం ఉందని తెలియజేస్తూ...

(వాయిస్ 20 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రభుత్వ నిర్ణయాలను ప్రణాళికా బద్ధంగా, జాప్యం లేకుండాల అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నతాధికారులను ఆదేశించారు. ఈరోజు ఆయన నివాసంలో ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదిలీలపై చర్చించారు. అనంతరం మంగళగిరిలో ఉన్న తెలుగుదేశం కేంద్ర పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాయలసీమ నుంచి మధ్య బంగాళాఖాతం వరకు ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు,

బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. రాష్ట్రంలో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జాతీయ బాలల హక్కుల కమిషన్ పురస్కారానికి ఎంపికైన ఐ.ఏ.ఎస్. అధికారి ఎమ్.వి.ఆర్.కృష్ణ తేజకు ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ అభినందనలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన కృష్ణ తేజ కేరళ రాష్ట్రంలో బాధ్యతలు నిర్వర్తిస్తూ ప్రజా సంక్షేమం, పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. ప్రస్తుతం త్రిసూర్ జిల్లా కలెక్టర్ గా బాధ్యతల్లో ఉన్న ఆయన ఆ జిల్లాలో బాలల హక్కుల పరిరక్షణకు ఉత్తమ విధానాలు అనుసరించారు. కరోనా కష్ట కాలంలో, కేరళ వరదల విపత్తు సమయంలో కృష్ణ తేజ విధి నిర్వహణలో చూపిన అంకిత భావానికి ఈ పురస్కారం లభించిందని ఆయన మరింతగా సేవలు అందిస్తూ ఉద్యోగులకు, యువతకు స్ఫూర్తినివ్వాలని పవన్ కళ్యాణ్ ఆకాక్షించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరం జిల్లాలో 17వ తేదీన బక్రీద్ పండుగ రోజు పశువధ, అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలను తీసుకుంటామని జిల్లా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టర్ ఎ.విశ్వేశ్వర్రావు హెచ్చరించారు. ప్రతీఒక్కరూ తప్పనిసరిగా జంతు సంక్షేమ చట్టాలను పాటించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రిజర్వేషన్ అండ్ ప్రొహిబిషన్ ఆఫ్ స్లాటరీ యాక్ట్-1977, ట్రాన్స్‌పోర్ట్ ఆఫ్ యానిమల్ రూల్స్ 1978, 2001 ప్రకారం, జంతు సంక్షేమ చట్టాలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. దీనిపై జిల్లాలోని పశు సంవర్ధక శాఖాధికారులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు దృష్టి సారించాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో పన్నులు పెంచకుండానే ఆర్థిక పురోగతి సాధిస్తామని ఆర్థిక, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. ఈరోజు ఒక వార్తా సంస్థ ప్రతినిధితో ఆయన మాట్లాడుతూ... రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనుభవం, దార్శనికతతో ఆ లక్ష్యాన్ని సాధిస్తామన్నారు. సామాన్యుడిపై భారం తగ్గిస్తూ, ఆర్థికాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక అవకతవకలన్నీ వెలికితీసి, త్వరలోనే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వివరాలను ప్రజలకు వెల్లడిస్తామని ఆర్థిక మంత్రి తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం సుద్దగొమ్మి గ్రామ సమీపంలో చెక్ పోస్టు వద్ద తనిఖీ చేయగా కారులోని 13 గోనె సంచుల్లో సుమారు 397 తాబేళ్లు గుర్తించామని అటవీ శాఖ అధికారులు తెలియజేశారు. రంపచోడవరం డివిజన్ ఫోక్స్ పేట ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని రామచంద్రపురం నుంచి ఒరిస్సా కు తాబేళ్లు అక్రమరవాణా జరుగుతుందని సమాచారం రావడంతో వాహనాన్ని వెంబడించగా కారులో తాబేళ్లు గుర్తించామని అన్నారు. ఆ తాబేళ్లను పాపికొండలు అభయారణ్యంలో సురక్షితమైన ప్రదేశంలో విడిచిపెడతామని జిల్లా అటవీ శాఖ అధికారి నరేంద్ర తెలిపారు. వన్యప్రాణుల సంరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు అన్ని శాఖల అధికారులు తమకు సహకరించాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పురుషుల టీ-20 ప్రపంచ కప్ లో భాగంగా కెనడా, భారత్ జట్ల మధ్య ఈరోజు క్రికెట్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్ భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు ఫ్లోరిడాలోని సెంట్రల్ బ్రోవార్డ్ రీజినల్ పార్క్ స్టేడియం లాడర్‌హిల్‌లో జరగనుంది. హ్యాట్రిక్ విజయాలతో సూపర్-8లోకి ప్రవేశించిన భారత జట్టు ఆత్మవిశ్వాసంతో ఉంది. కాగా నిన్న అమెరికా - ఐర్లాండ్ జట్ల మధ్య మ్యాచ్ వర్షం కారణంగా రద్దు కావడంతో, భారత్ తో పాటు అమెరికా జట్టు గ్రూప్-ఏ నుంచి సూపర్-8కి అర్హత సాధించాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =